క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: స్థానిక వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి శనివారం భక్తుల విశేష పూజలు చేపట్టారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చ కులు గోపీశర్మ, శివ లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి, మహాత్రిపుర సుందరి సమేత మానస లింగేశ్వర స్వామి అమ్మవార్లకు ఉదయాన్నే నిత్య పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, శ్రీ అభయాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. .

ప్రజలపై అల్లా దయ ఉండాలి



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(వ్యవసాయం): పవిత్ర రంజాన్ మాసంలో అల్లా దయ అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి గాంధీచౌక్ మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం మసీదు పెద్దలు ఎమ్మెల్యేను సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు సమ్మద్ పాల్గొన్నారు.

ముత్తలూరులో వైద్య శిబిరం

రుద్రవరం: మండలంలోని ముత్తలూరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పాములేటి ఆధ్వర్యంలో వైద్యులు అమర్‌నాథ్‌రెడ్డి,శివాని శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 426 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పన్ను వసూళ్లలో అలసత్వం వీడాలి

నంద్యాల(సిటీ): పన్ను వసూళ్లలో సిబ్బంది అలసత్వం వీడాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఎన్‌జీఓ కాలనీ, ఏకలవ్యనగర్, విశ్వనగర్, ఎస్బీఐ కాలనీ ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది చేపట్టిన పన్ను వసూళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నేటి (ఆదివారం) వరకు పన్నులపై వడ్డీ మాఫీ ఉందని సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలు వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు.

ఆలయ మండపం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సుంకులమ్మ వీధిలో వెలసిన శ్రీసుంకులాపరమేశ్వరి దేవస్థానంలో అదనపు నూతన మండపం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం నిర్వాహకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చుమ్మా నాగన్న, ఉపాధ్యక్షుడు నరసింహారావు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రకటనలు నిషేధం

నంద్యాల(సిటీ): పట్టణ పరిధిలోని హోర్డింగులు, ఇతర ప్రధాన కూడళ్లలోని ప్రచార బిల్ బోర్డులపై రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రకటనలు నిషేధమని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో యూనీ యాడ్స్, ప్రకాష్ యాడ్స్, చందన బ్రదర్స్, దేవి యాడ్స్, ఐలుక్ యాడ్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచారాలు చేయరాదని ఆదేశించారు. హోర్డింగ్‌లు ఏర్పాటు చేసే ముందు ఈసీ అనుమతి తీసుకోవాలన్నారు.

నగదు స్వాధీనం

ఆళ్లగడ్డ: పట్టణంలో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.5.18లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రమేష్‌బాబు తెలిపారు. శనివారం పాతబస్టాండులో వాహనాలు తనిఖీ చేస్తుండగా నాలుగురోడ్ల సెంటర్ నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా సంజీవ రాయుడు అనే వ్యక్తి వద్ద రూ.5.18 లక్షలు లభ్యమైంది. ఇందుకు ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకొని ఎన్నికల అధికారులకు అప్పగించారు.

చాగలమర్రి వద్ద రూ.2.55 లక్షలు..

చాగలమర్రి: స్థానిక టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద శనివారం తెల్లవారుజామున నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.2.55 లక్షల నగదు, 15 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా, దువ్వూరు మండలం, చింతకుంట అరుంధతీనగర్‌కు చెందిన సుబ్బారాయుడు ఏపీ04 టీటీ 7870 నంబరు గల టాటా ఏసీ వాహనంలో తెల్లవారుజామున రూ.1.55 లక్షల నగదు,బ్రాహ్మణపల్లెకు చెందిన వెంకటేశ్వరరెడ్డి బైక్‌ను పెద్దమకానం వద్ద తనిఖీ చేయగా రూ.99,800 లభించింది. ఆధారాలు లేకపోవడతో ఎన్నికల అధికారులకు అప్పగించారు. చాగలమర్రి సమీపంలోని చాగలమ్మ గుడి వద్ద దువ్వూరు మండలం, ఇడమడక గ్రామానికి చెందిన ముద్దం సుబ్బారాయుడు అక్రమంగా విక్రయిస్తుండగా దాడి చేసి 15 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి

గోస్పాడు: అనారోగ్యంతో బాధపడుతున్న, గర్భిణు లు, బాలింతలకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలని పీఆర్టీయూ నాయకుడు సుబ్బరాయుడు నాయక్ శనివారం కోరారు. నాయకులు విజయ రావు, సురేష్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి కష్టాలకు చెక్

- రాయపాడులో తీరిన మంచినీటి ఇక్కట్లు
- రూ.36.72 లక్షలతో పనులు
- జలజీవన్ పథకం కింద గ్రామానికి ప్రయోజనం
- 40 సంవత్సరాల ఇబ్బందులకు పరిష్కారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గ్రామంగా రూపుదాల్చినప్పటి నుంచి మంచినీరు లేక ఆ గ్రామ ప్రజలు అలమటించారు. సమస్యను పట్టించుకునేందుకు ఎవరైనా వస్తారని ఎదురు చూశారు. కనిపించిన నాయకులు, ముఖ్య అధికారులందరికీ వినతి పత్రాలు ఇచ్చి అలసిపోయారు. ఏ ఒక్కరూ పరిష్కరించలేదు కదా.. కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గ్రామ సమీపంలోని కుందూ నది నీటితో గొంతు తడుపుకున్నారు. అయితే గత పదిహేనేళ్లుగా ఆ నీరు కూడా కలుషితం కావడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. పక్కగ్రామాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయపాడు వాసుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించి నీటి కష్టాలను తీర్చింది.

గోస్పాడు: రాయపాడు.. నీటి సమస్యతో అల్లాడుతుండేది. గ్రామప్రజలు ఎంతోకాలంగా నీటి కష్టాలు ఎదుర్కొంటూ నానా అవస్థలు పడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో చెంతనే ఉన్న కుందూనీటితో కాలం గడిపారు. గతంలో పాలకులు ఎందరొచ్చినా సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో 40 సంవత్సరాలుగా ప్రజలు తాగునీటికి కష్టాలు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు మంజూరు చేసి నీటి కష్టాలు తీరేలా పనులు చేపట్టింది.

తీరిన దాహార్తి..

వేసవి వచ్చిందంటే సమీప కుందూలో చలిమల ద్వారా నీటిని తోడుకొని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేది. గతంలో కుందూలో వచ్చే నీరు కొంత వరకు బాగున్నా 15 సంవత్సరాల నుంచి ఆ నీరు కూడా కలుషితం కావడంతో ప్రజలు నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఎండ కాలంలో కుందూలో నీటి ప్రవాహం నిలిచిపోవడం, గుంతల్లో నిలిచిన నీటిని తాగలేక, చెలిమల్లో కూడా కలుషిత నీరు వస్తుండటంతో పక్క గ్రామాలకు వెళ్లి తెచ్చుకునేవారు. ప్రభుత్వం గ్రామానికి నీరందించేందుకు రూ.36.72 లక్షలు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంది. గ్రామంలో సరైన మంచినీటి బోర్లు పడకపోవడంతో రెండో విడత కింద జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా సమీపంలోనున్న గగ్గటూరు గ్రామంలో బోరు వేసి అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల మేర పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసి, గ్రామంలో నీటి సంప్ ఏర్పాటు చేశారు. అందులోని నీటిని ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు.



కుళాయి నుంచి వచ్చే నీటిని పట్టుకుంటున్న రాయపాడువాసులు



గగ్గటూరు వద్ద ఏర్పాటు చేసిన బోరు



గ్రామంలో ఏర్పాటు చేసిన నీటి సంప్

నీటి సమస్య తీరింది



గ్రామంలో ఎంతో కాలంగా తాగునీటి సమస్య ఉండేది. నీటి కోసం ప్రతిరోజూ అవస్థలు పడుతుండేవాళ్లం. ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. చేతకాని వారు గ్రామంలోకి వచ్చే నీటినే తాగుతూ కాలం గడిపేవాళ్లు. ఎంతో కాలంగా ఉన్న నీటి సమస్య తీరడంతో ఆనందంగా ఉంది. – నామాల వెంకటేశ్వర్లు, రాయపాడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పటి నుంచో వెంటాడుతున్న నీటి సమస్యకు పరిష్కారం చూపింది. గతంలో కుందూ నీటితో అవసరాలు తీర్చుకోవాల్సి వచ్చేది. ఎంతో కాలంగా నీటి సమస్య పరిష్కారం కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ప్రస్తుతం శాశ్వతంగా పరిష్కారమయ్యేలా పైప్‌లైన్ ద్వారా నీటిని అందిస్తున్నారు.

– యాసం రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్

అవస్థలు తప్పించాం



నీటి సమస్య పరిష్కారానికి రూ.36.72లక్షలు మంజూరు చేయడంతో పనులు చేపట్టాం. దీంతో గ్రామానికి ఎంతో కాలంగా ఉన్న నీటి సమస్యకు పరిష్కారం చూపేలా జల్‌జీవన్ మిషన్ పథకం కింద పనులు చేపట్టి గ్రామానికి నీరు అందించేలా చర్యలు చేపట్టాం.

– యాసం రామేశ్వరమ్మ, సర్పంచ్

ఫరూక్.. నంద్యాలకు ఏం చేశారు?

- ఆయన బీజేపీ కండువా ఎందుకు వేసుకోవడం లేదు
- వీధుల్లో మీటింగ్‌లు విజయవంతం చేసుకోలేని మీరు.. తమ సభ విఫలమైందనడం హాస్యాస్పదం
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: 40 సంవత్సరాల రాజకీయ అనుభవం.. 14 సంవత్సరాలు వివిధ మంత్రిత్వ శాఖల్లో పదవులు.. సీనియర్ నాయకుడని చెప్పుకుంటున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఫరూక్ నంద్యాలలో ఏ అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు చెప్పాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నంద్యాలలో జరిగిన మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభ సక్సెస్ కావడంతో జీర్ణించుకోలేని ఫరూక్ తాజాగా మీడియా సమావేశంలో శిల్పా కుటుంబం, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అసహనంతో అసంబద్ధ వాఖ్యలు చేయడంపై శనివారం సాయంత్రం ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన మేమంతా సిద్ధం సభ కనివిని ఎరుగని రీతిలో జరిగిందని, మైదానంలో ఎంత మంది ఉన్నారో.. అంతేమంది బయటకూడా ఉన్నారని, సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. చంద్రబాబునాయుడు నంద్యాలలో రాజ్‌థియేటర్ వద్ద రోడ్డుపై నిర్వహించిన సభకు 2వేల మంది కూడా రాలేదని గుర్తు చేశారు. లోకేష్ పాతయాత్ర సమయంలో కూడా గ్రౌండ్‌లో మీటింగ్ పెట్టుకుంటే జనాలు రారని, రోడ్లపై పెట్టుకున్న ప్రజలు రాలేదంటే టీడీపీ పరిస్థితి ఎంతటికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చన్నారు. తాను ముక్కుసూటి రాజకీయాలు చేస్తానని చెప్పుకునే ఫరూక్.. మీతో పొత్తులో ఉన్న బీజేపీ కండువాను మీరెందుకు వేసుకోవడం లేదని ప్రశ్నించారు. నంద్యాలలో తన విలువైన స్థలాలను ప్రజల ఉచితంగా ఇచ్చానని చెప్పడం సరికాదన్నారు. రాజ్ థియేటర్ ప్రాంతంలో రోడ్డు వెడల్పులో నష్టపోయిన స్థలానికి ప్రభుత్వం టీడీఆర్ ద్వారా నష్టపరిహారంగా నేరుగా రూ.1.42 కోట్లు తీసుకున్నారనేది గుర్తులేదా అని నిలదీశారు. ఫరూక్‌తో పాటు నష్టపోయిన బాధితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.25 కోట్లు పరిహారం చెల్లించిందని చెప్పారు. పద్మావతి నగర్‌లో ఇచ్చిన స్థలానికి కూడా పరిహారం తీసుకున్నారు. నంద్యాలలో అభివృద్ధి జరుగలేదనే వారు ఒక్కసారి బయటకు వచ్చి వీధుల్లో, పట్టణంలో తిరిగితే అర్థమవుతుందన్నారు. మీరు చేయలేకపోవడం, మేం చేసి చూపడం జీర్ణించుకోలేకపోతున్నారా మండిపడ్డారు. ఫరూక్ హయాంలోనే నంద్యాల షుగర్ ఫ్యాక్టరీ, నూలు మిల్లు మూసేశారని, దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడినా నాడు పట్టించుకోలేదన్నారు. సుబ్బారెడ్డి పాలెం గ్రామంలో కొందరిని మాట్లాడాలని స్థానిక దేవాలయానికి పిలిపించుకొని వారికి ఇష్టం లేకపోయినా టీడీపీ కండువాలు వేశారని, అదే గ్రామస్తులు మరుసటి రోజు తాము టీడీపీలో చేరలేదని, ఫరూక్ వద్దన్నా బలవంతంగా కండువాలు కప్పారని చెప్పారనేది నిజం కాదా అన్నారు. పట్టణానికి మెడికల్ కళాశాల రాకుండా కోర్టులకు వెళ్లింది ఎవరో ఫరూక్ చెప్పాలన్నారు. మార్కెట్ యార్డుకు చెందిన కాంప్లెక్స్‌లు నిరుపయోగంగా ఉంటే వాటిని వినియోగంలోకి తీసుకువచ్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అగ్రిమెంట్ మేరకు బాడుగలను చెల్లిస్తున్నామన్నారు. రాజకీయాల్లో గెలిచినా ఓడినా నంద్యాల ప్రజలకు సేవలను కొనసాగిస్తున్నామని చెప్పారు. తప్పుడు ప్రచారాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా మరోసారి రెపరెపలాడుతుందని స్పష్టం చేశారు.

వాహనాలు సీజ్

శిరివెళ్ల: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించాడనే ఫిర్యాదుపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లెకు చెందిన మహబూబ్‌బాషా తన మోటార్‌సైకిల్ ముందు భాగంలో జనసేన గుర్తు, పవన్ కల్యాణ్ స్టిక్కర్‌ను అతికించుకున్నాడు. శిరివెళ్ల మెట్ట నుంచి రుద్రవరం మండలం తువ్వపల్లెకు బైక్‌పై వెళ్తుండంగా శిరివెళ్లలో వెంకటరమణ డీఈఈతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ గమనించి వ్యక్తిని, బైక్‌ను స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేశారు.

ఉయ్యాలవాడలో..

ఉయ్యాలవాడ : ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడడంతో రెండు వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి శనివారం తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ -1 బృందం మండలంలోని మాయలూరు సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన చుక్కా పృథ్వీరాజ్ హీరోహోండా మోటార్ సైకిల్ డూమ్‌పై జనసేన స్టిక్కర్, సంజామల మండలం ఆకు మల్ల గ్రామానికి చెందిన పాదం సాల్మన్ మోటార్ సైకిల్‌పై సిద్ధం స్టిక్కర్ ఉండటంతో రెండు వాహనాలను సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ డిప్యూటీ తహసీల్దార్ షేక్ మహబూబ్‌బాషా, కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ రఫీ వివరించారు.

మరోసారి వేలాలు వాయిదా

నంద్యాల(సిటీ): పట్టణంలోని మార్కెట్ గేట్లు, సైకిల్ పార్కింగ్‌లకు నిర్వహించిన బహిరంగ వేలాలు మరోసారి వాయిదా పడ్డాయి. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ గేట్లు, సైకిల్ స్టాండ్ పార్కింగ్ నిర్వహణకు బహిరంగ వేలాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేలానికి సరైన పోటీ లేకపోవడంతో వాయిదా వేశామని చెప్పారు. ఈ నెల 15న నిర్వహించిన వేలంలో పశువుల సంత, మాంసం/చేపల మార్కెట్లకు వేలం జరుగగా మార్కెట్ గేట్ల, సైకిల్ స్టాండ్ పార్కింగ్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా పడిందన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం



పంచాయతీ కార్యదర్శి నూర్‌బాషా దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మనూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఓ.నూర్‌బాషా పదవీ విరమణ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నూర్‌బాషా దంపతులను పరిపాలన అధికారి పార్థసారథి, సంజామల ఎంపీడీఓ నాగకుమార్, ఈఓపీఆర్‌డీ పాపారాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు హాజరై శాలువ కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈయన 2002లో పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగం పొంది ఉయ్యాలవాడ గ్రామ సచివాలయానికి పంచాయతీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇదే మండలంలో దాదాపు 20 సంవత్సరాల పాటు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు.

వాల్మీకులకు మొదట సీట్లు కేటాయించింది జగనే

నంద్యాల(అర్బన్): త్వరలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా బీసీ కోటా కింద వాల్మీకులను ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా మొదట ప్రకటించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో ఎన్‌డీఏ మిత్రపక్షాలు వాల్మీకులకు సీట్లు కేటాయించాయన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం వాల్మీకి ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకులకు అత్యధికంగా సీట్లు కేటాయించిన జగనన్నకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నాయకులు జయరాం, మధుగోపాల్, లాయర్ సుబ్బరాయుడు, నాగేశ్వరరావు, కుమార్, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యేసు మరణాన్ని జయించెను



రన్‌ఫర్ జీసెస్ పీస్ ర్యాలీని ప్రారంభిస్తున్న పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ జోసెఫ్

నంద్యాల(న్యూటౌన్): ఏసు క్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచెనని నంద్యాల డయాసిస్ ట్రెజరర్, పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ జోసెఫ్‌బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి వద్ద రన్‌ఫర్ జీసెస్ పీస్ ర్యాలీని డయాసిస్ ట్రెజరర్‌తో పాటు రన్‌ఫర్ జీసెస్ కోఆర్డినేటర్ రవీంద్రపాల్, క్రైస్తవ సంఘాల నిర్వాహకులు ఏసుదాసు, జెండా ఊపి ప్రారంభించారు. రవీంద్రపాల్ పర్యవేక్షణలో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి వారు మాట్లాడుతూ క్రీస్తు సిలువ శ్రమలను పొంది మరణించిన అనంతరం పునరుత్థానుడయ్యాడన్నారు. ఈ విజయానికి గుర్తుగా ప్రతి క్రైస్తవ విశ్వాసి విజయ యాత్రలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు.

నేడు ఈస్టర్..

క్రీస్తు గుడ్ ఫ్రైడే రోజున సిలువపై మరణించి మూడవ రోజైన ఆదివారం తెల్లవారుజామున పునరుత్థానుడవడాన్ని క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా పరిశుద్ధ మత్తయి ఆలయం, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1 ఆలయంలో నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జిబిషప్ రైట్‌రెవరెండ్ ఐజక్ వరప్రసాద్ సందేశం ఇస్తారని సంఘ పెద్దలు తెలిపారు.

పోలింగ్ నిర్వహణపై శిక్షణ



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల(సిటీ): రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహణపై శనివారం మున్సిపల్ టౌన్‌హాల్‌లో శిక్షణ కార్యక్రమం జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కీలకమైన అంశాలను క్షుణ్ణంగా వివరించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ యంత్రాల నిర్వహణ, సులభతరమైన ఓటింగ్ కోసం అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. మాక్ పోలింగ్ నిర్వహణ, ఏజెంట్ల పనితీరు, వీవీ పాట్ యంత్రాలలో ఏర్పడే సాంకేతిక కారణాలను పసిగట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాయంత్రం 5గంటల లోపు లైన్‌లో వేచి ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు.

ఆటో,కారు ఢీ.. మహిళ మృతి



మృతి చెందిన రమణమ్మ (ఫైల్)

ఉయ్యాలవాడ : ఆళ్లగడ్డ, ఆర్.పాంపల్లె పంచాయతీరాజ్ రహదారిలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో మహిళ గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు,108 పైలట్ జీవన్ తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండలం టి.లింగందిన్నె గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఉయ్యాలవాడ మండలంలోని గోవిందపల్లె గ్రామ సమీపంలో ఓ రైతుకు చెందిన మిరప కోతలు కోసేందుకు 15 మంది ఆటోలో వచ్చారు. పనులు ముగించుకుని మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్తుండగా ఆలయ సమీపంలో కొలిమిగుండ్లకు చెందిన కారును ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటోలోనున్న రమణమ్మ, పుల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహ నంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రమణమ్మ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి ఓ కుమారుడు ఉన్నాడు.

ఒక్క ఓటూ దుర్వినియోగం కారాదు



మాట్లాడుతున్న ఆర్‌ఓ మల్లికార్జునరెడ్డి

ఆళ్లగడ్డ: ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చినప్పటి నుంచి తన ఓటును సద్వినియోగం చేసుకుని తిరిగి బయటకు వెళ్లే వరకు ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఏ పోలింగ్ కేంద్రంలో కూడా ఒక్క ఓటు కూడా దుర్వినియోగం కాకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీరామ కల్యాణ మండపంలో శనివారం ప్రిసైడింగ్ అధికారులు (పీఓ). సహాయ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీఓ)కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున గంటన్నర ముందు.. ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి, ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఏజెంట్లు, ముందుగా వచ్చిన ఓటర్లు ఉంటే వారి ముందు ఈవీఎంల్లో వాటిని తొలగించి వీవీ ప్యాట్లు ఖాళీ చేసి.. సీలు వేయాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే సెక్టోరియల్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సిబ్బంది ముందు రోజు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని పోలింగ్ రోజు వారివారి బూత్‌లలో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఉదయం నుంచే వీలైనంత వేగంగా పోలింగ్ జరిగేలా చూడాలని, వ్యక్తిగత అభిమానం, అభిప్రాయాలను ప్రదర్శించ రాదని చెప్పారు. అనంతరం సిబ్బంది విధులు, బాధ్యతలు, ఈవీఎంల పనితీరు, ఎన్నికల ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నజీర్ అహమ్మద్, ఏపీ రమణమ్మ, నాగరాజు, మురళీమోహన్, మధురవాణి, వెంకటరమణ పాల్గొన్నారు.

1 నుంచి యోగా శిక్షణ తరగతులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మున్సిపల్ టౌన్‌పార్కులో ఆయూష్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రా రంభిస్తున్నట్లు నిర్వాహకులు కండే ఆనంద్ గురూజీ శనివారం తెలిపారు. వివరాలకు సెల్ 9989983673 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సన్మానం



శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల: స్థానిక డీఐపీఆర్‌ఓ కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేసిన బి.శ్రీనివాసులును కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. డీపీఆర్‌ఓ మల్లికార్జునయ్య ఆయన సేవలను కొనియాడారు. సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రామ్ చరణ్, సిబ్బంది సందీప్ కుమార్, పుల్లయ్య, త్రినాథ్ పాల్గొన్నారు.



